ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY






హుజూరాబాద్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న చిలుకవాగు

ఎడతెరిపిలేని వాన

చిగురుమామిడి మండలం రేకొండ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

- చెరువులు, కుంటలకు జలకళ
- పలుచోట్ల విరిగిన విద్యుత్ స్తంభాలు
- నేలకొరిగిన వృక్షాలు
- కూలిన ఇళ్లు.. రోడ్లపై నిలిచిన వరద నీరు

కరీంనగర్ టౌన్, జూలై 21: జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోయర్ మానేరు డ్యాం (ఎల్‌ఎండీ)తోపాటు చెరువులు, కుంటలు, వాగులు, వంకల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడ తెరపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. ఆదివారం సెలవు దినం కావడంతో అంద రూ ఇళ్లకే పరిమి తమయ్యారు. రెక్కాడితే కాని డొక్కాడని దినసరి కూలీలు, కార్మి కులు, చిరువ్యాపారులు, వీధి వ్యాపా రులు, కార్మికులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలతో అసంపూర్తిగా వదిలిపెట్టిన రోడ్లు, డ్రైనేజీలలో వరద నీరు నిలువగా, పలు చోట్ల డ్రైనేజీల్లో నుంచి వరద నీరు రోడ్లపైకి వచ్చిని లిచింది. జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కరీంనగర్‌లో నగరపాలక సంస్థ అధికారులు 64 మందితో రెస్క్యూ టీంలను ఏర్పాటు చేశారు. నగరంలోని పలు చోట్ల మేయర్ యాదగిరి సునీల్‌రావు, ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యటించించారు. డీఆర్‌ఎఫ్ బృందాలతో చెట్లను, చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ స్తంభాలను సరి చేశారు. రోడ్లపై నిలిచిన మురుగు, వరద నీటిని డ్రైనేజీల్లోకి మళ్లించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అత్యవసర సేవలకోసం 24 గంటల కాల్ సెంటర్ నంబర్ 98499-06694ను ఏర్పాటు చేశారు. వర్షాలతో నగరంలోని భగత్‌నగర్‌లో విద్యుత్ స్తంభం నేలకొరగగా, చైతన్యపురి, హిందూపురి కాలనీలో పార్కింగ్ చేసిన కారుపై ఒక పెద్దచెట్టు పడింది. మరికొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. పలుచోట్ల వర్షపు నీరు నిలిచాయి. దీంతో నగరపాలక సంస్థ రెస్క్యూటీం సిబ్బంది, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సానిటేషన్ అధికారులుసిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలను చేపట్టారు. శిథిలావస్థలోని ఇళ్లను ఖాళీ చేయించి ఆ ఇంట్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సహాయక చర్యల్లో డీఈలు ఓంప్రకాశ్, లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, అయూబ్ ఖాన్, యాదగిరి, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీహరి, టీపీబీవోలు నవీన్, రాజు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ స్వామి, గఫూర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు గట్టు శ్రీనివాస్, శ్రీధర్, వెంకన్న, సర్వోత్తంరెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.



33వ డివిజన్‌లో విరిగిన విద్యుత్ స్తంభం



చైతన్యపురిలో కూలిన చెట్టు

ఉరకలేస్తున్న రాయికల్ జలపాతం



రాయికల్ జలపాతం వద్ద సందర్శకుల సందడి

సైదాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని రాయికల్ జలపాతం ఉరకలేస్తోంది. జలపాతం అందాలు చూసేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్న వర్షాన్ని లెక్క చేయకుండా వర్షంలో తడుస్తూనే సందర్శకులు రాయికల్ జలపాతాన్ని సందర్శిస్తున్నారు. జలపాతం వద్దకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో సందర్శకులు ఇబ్బంది పడ్డారు. మండలంలో శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు 67.6 మిల్లీమీటర్ల సగటు వర్షాపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు.

హుజూరాబాద్ డివిజన్‌లో..

హుజూరాబాద్: హుజూరాబాద్ డివిజన్‌లో రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మొన్నటి వరకు వర్షాలు లేక ఇబ్బంది పడ్డ రైతులు పొలాల్లో నీరు చేరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పొలాలను దున్నుతున్నారు. చెరువుల్లోకి 50 శాతం వరకు నీళ్లు చేరగా, కుంటలు మత్తళ్లు పడుతున్నాయి. హుజూరాబాద్‌లోని చిలుకవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పట్టణంలోని పలు కాలనీలోక్లి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుడగ జంగాల కాలనీలో ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో కౌన్సిలర్ సృజన-పూర్ణచందర్ ఎక్స్‌కవేటర్ సహాయంతో నీటిని తొలగించారు. పట్ట ణంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేఖర్, మున్సిపల్ సిబ్బంది ప్రతాప రాజు, ఆశీస్ పరిస్థితిని పర్యవేక్షించారు. పట్టణంలోని పాత రిలయన్స్ పెట్రోల్ పంపు సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు ఆగడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మత్తడి దూకుతున్న ముత్తారం రామసముద్రం చెరువు

శంకరపట్నం: మండలంలోని ముత్తారం రామసముద్రం చెరువు మత్తడి దూకుతోంది. చెరువు మత్తడి దూకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేశవపట్నం వద్ద వాగు జోరుగా ప్రవహిస్తోంది.

- జమ్మికుంట/జమ్మికుంట రూరల్: జమ్మికుంటలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండు కుండలా మా రాయి. పట్టణం లోని లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. దుర్గా కాలని, మోత్కులగూడెం, హౌసింగ్‌బోర్డు, ఆబాది జమ్మికుంటలోని పలు ప్రాంతాలకు నీళ్లు చేరాయి. కౌన్సిలర్ శ్రీపతి నరేష్ మున్సిపల్ సిబ్బందితో కలిసి వరుద నీటి కాల్వలో చెత్త చేదారం పేరుక పోకుండా చర్యలు తీసుకున్నారు. 17వ వార్డులోని పలు వీధుల్లో నిలిచి పోయిన వరుద నీటిని బయటకు పంపించేందుకు ధర్మారం రోడ్డులో మున్సిపల్ సిబ్బంది మట్టిని తొలగించారు. నాయిని చెరువుకు జలకళను సంతరించు కుంది. మానేరు నిండుగా ప్రవహిస్తోంది. శంబునపల్లి పరిధిలోని పరి మల కాలని శివారులో విద్యుత్ వైర్లు తెగి పడి పాడి గేదె మృతి చెందింది.
- మానకొండూర్: మండలంలోని వి విధ గ్రామాల్లో భారీ వర్షాలతో పంటపొ లాలు నీట మునిగాయి. చెరువులు జల కళను సంతరించుకుని మత్తడి దూకు తున్నాయి. చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు చేరి జలకళను సంతరించుకున్నా యి. మండలంలోని దేవంపల్లి, అన్నారం గ్రామాలలో చెరువులు మత్తడి దూకుతున్నా యి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వర్షం కురుస్తుండడంతో మండల ప్రజలు బయటికి వెల్లలేక ఇంటికే పరిమితం అయ్యారు.
- చొప్పదండి: పట్టణంలో వర్షపు నీరు ప్రధాన రహదారిపై నిలిచిపోయాయి. రహదారి వెడెల్పు పనులు అసంపూర్తిగా నిలిపివేయగా వర్షపు నీరు మురికి కాల్వలోకి పోయే పరిస్థితి లేకుండా పోయింది. మండల పరిషత్ కార్యలయం క్రాసింగ్, బస్టాండ్‌తోపాటు అనేక చోట్ల రోడ్డుపై నీరు నిలువగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు.
- వీణవంక: మండల కేంద్రం - నర్సింగాపూర్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. జమ్మికుంట, కరీంనగర్ రహదారి ప్రమాదకరంగా మారింది. ఎల్బాకలోని చెరువు వరుద నీటితో పూర్తిగా నిండి మత్తడి దూకుతోంది. కనపర్తి రోడ్డుపై వరద నీరు చేరాయి. గ్రామల్లోని కుంటలు నిండు కుండల్లా మారాయి.
- చిగురుమామిడి: మండలంలో కురుస్తున భారీ వర్షాలకు పలు రోడ్ల దెబ్బతిన్నాయి. ఇందుర్తి నుంచి కోహెడ వెళ్లే రోడ్డులో ఉన్న ఉధృతంగా ప్రవహించింది. నీరు లోలెవల్ వంతెనను అనుకుని ప్రవహించాయి. పలు గ్రామాల్లో నారుమళ్లు నీట మునిగాయి. రేకొండ నుంచి సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.


బాబోయ్ తీగల వంతెన





ఎంతో అర్భాటంగా ప్రారంభించిన కేబుల్ బ్రిడ్జి ఏడాది తిరగకుండానే వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తోంది. నిత్యం మరమ్మతులు చేస్తున్నా రోడ్డు దెబ్బతింటోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బ్రిడ్జిపై వేసిన రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో ప్రారంభం



తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఎగువ కురుస్తున్న వర్షాలతో పాటు కరీంనగర్ చుట్టు పక్కల గ్రామాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లు, కాలనీలు అన్ని జలమయమయ్యాయి. మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం వరకు 56.4 మిల్లీమీటర్ల వర్షపాత నమోదైందని అధికారులు వెల్లడించారు. దిగువ మానేరు జలాశయం పూర్తి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ఆదివారం రాత్రి వరకు 5.166 టీఎంసీల నీరు ఎల్‌ఎండిలో నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 741 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. .



మానకొండూర్ మండలం గంగిపల్లిలో నీట మునిగిన పంటపొలాలు



సైదాపూర్ మండలం సర్వాయిపేటలో ప్రవహిస్తున్న వాగు



రేకుర్తిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని తొలగిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది



హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో పొలాల్లో చేరిన వర్షపు నీరు



వీణవంక మండలం నర్సింగాపూర్‌లో వరదతో ప్రమాదకరంగా మారిన జమ్మికుంట కరీంనగర్ రహదారి



కరీంనగర్ కోతిరాంపూర్‌లో డ్రైనేజీ తవ్వి నీటిని మళ్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి



సాయిబాబాకు హారతి ఇస్తున్న అర్చకుడు

భక్తులతో పోటెత్తిన సాయిబాబా ఆలయాలు

కరీంనగర్ కల్చరల్, జూలై 21: జిల్లా కేంద్రంలోని వివిధ ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో సందడి కనిపించగా సాయి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయంలో ఉదయం ఫలరస పంచామృతాలతో అభిషేకం అనంతరం పుష్పార్చన, విశేషాలంకారం జరిగింది. 24 గంటల అఖండ నామ సంకీర్తన ప్రారంభించారు. భాగ్యనగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఫలరస పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం హవనం, అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ జరిగింది.



పూజలు చేస్తున్న భక్తులు

వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

సిరిసిల్ల రూరల్, జూలై 21: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, అప్పటి వరకు ఉద్యమం కొనసాగిస్తామని సిరిసిల్ల పవర్ లూం వస్త్ర పరిశ్రమ అనుబంధ పరిశ్రమల సమాఖ్య నాయకులు ప్రకటించారు. జేఏసీ అధ్వర్యంలో సోమవారం నుంచి చేపట్టనున్న రిలే నిరాహార దీక్షల పోస్టర్లను ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటి పాముల దామోదర్, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు పంతం రవి, కోడం రమణ మాట్లాడారు. నేతన్నలకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం ఎనిమిది నెలలుగా నిర్లక్ష్యం చేస్తోందని, ఇప్పటివరకు దాదాపు 10 మంది మరమగ్గాల కార్మికులు ఉపాధిలేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యజమానులు, ఆసాములు మరమగ్గాలను తుక్కు కింద అమ్ముకుంటున్నారన్నా రు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆందో ళనలు చేపడుతున్నట్లు చెప్పారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టే రిలే నిరాహార దీక్షను కార్మికులు, ఆసాములు, యజమానులు విజయవంతం చేయాలని కోరారు. పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, మండల సత్యం, బండారి అశోక్, గౌడ రాజు, ఏనుగుల ఎల్లయ్య, బూట్ల నవీన్, శ్రీరాం సత్యం, కోడం అశోక్, మండల బాలరాజు, గంగుల శ్రీనివాస్, శ్రీగాధ విష్ణు, అన్నల్‌దాస్ శ్రీనివాస్, సిరిమల్ల సత్యం పాల్గొన్నారు.

మాదిగలను అణచివేస్తున్న రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు


సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

పెద్దపల్లిటౌన్, జూలై 21: మాదిగలను సీఎం రేవంత్‌రెడ్డి అణచివేస్తున్నారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు విమర్శించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన మాదిగ శక్తి సదస్సులో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఒక్క మాదిగలనే కాకుండా బీసీలకు అందవలసిన రాజకీయ వాటాను దక్కకుండా చేస్తున్నాడన్నారు. మాదిగలందరు కాంగ్రెస్ పార్టీకి ఓట్లేస్తే ముఖ్యమంత్రి అయ్యాక 80 లక్షల జనాభా కలిగిన మాదిగ జాతిని రాజకీయంగా రేవంత్ రెడ్డి బొంద పెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో మూడు ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా మాదిగలకు ఇవ్వలేదన్నారు. ప్రొఫెసర్ కాసీం మాట్లాడుతూ మాదిగలను విడదీయడానికి రాజకీయ నాయకులు కుట్రలు చేస్తారని, ఆ కుట్రలకు మాదిగలు బలి కావద్దన్నారు. సీనియర్ పాత్రికేయుడు విఠల్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలకు రాజకీయంగా జరుగుతున్న అన్యాయాలపై గొంతెత్తవలసిన అవసరం ఉన్నదన్నారు. కేసీఆర్ మోసం చేసిండనే మాదిగలందరు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను అన్యాయం చేశాడన్నారు. హైకోర్టు అడ్వకేట్ శరత్‌కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మాదిగలకు న్యాయంగా దక్కవలసిన రాజకీయ రిజర్వేషన్లను వెంకటస్వామి కుటుంబమే తన్నుకు పోతోందని, దీనికి రేవంత్‌రెడ్డి సహకరించారని విమర్శించారు. సమావేశంలో తెలంగాణ మాదిగ శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పినపాటి రజిని, జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి రవి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నాగుల కిరణ్ బాబు, నియోజక వర్గ అధ్యక్షులు తాళ్ళపెల్లి అంజయ్య, నాయకులు కొమ్ము ప్రవీణ్ బాబు, మడిపెల్లి మొగిలి, బోటుకు రమేష్ బాబు, అక్క పాక తిరుపతి, డాక్టర్ శరత్ బాబు, వివేక్ పటేల్, తాళ్ళ పెల్లి రమేష్, బానోత్ సంజీవ్ నాయక్, మీసాల సాయిలు, దీపక్, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 18,518 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. ఆదివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 18,518 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 19.693 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 33.317 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 503 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 13.378 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.065 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

పాముకాటుతో యువతి మృతి

సైదాపూర్, జూలై 21: సైదాపూర్ మండలంలోని రాయికల్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లాని తండా గ్రామానికి చెందిన భర్మావత్ శిరీష(21) అనే యువతి పాముకాటుతో మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న శిరీష వ్యవసాయ పనులకు వెళ్లింది. పొలం గట్టుపై నుంచి వెళ్తుంగా కాలుకి నల్ల తాచు పాము కాటు వేసింది. వెంటనే శిరిష స్థానికులకు తెలపడంతో స్థానికులు, కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందింది. శిరీష తండ్రి బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలపారు.

బహుజనుల హక్కుల రక్షణ కోసం ఉద్యమిద్దాం

- భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్


అభివాదం చేస్తున్న మహేందర్, తదితరులు

వేములవాడ టౌన్, జూలై 21: రాష్ట్రంలో దళిత, బహుజన, గిరిజన, ముస్లిం మైనార్టీ హక్కుల రక్షణ కోసం ఉద్యమిద్దామని భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్ అన్నారు. వేములవాడ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన భీమ్ ఆర్మీ ఆవిర్భావ సభ సందర్భంగా ముఖ్య అతిథిగా మహేందర్ హాజరై మాట్లాడారు. దళిత మైనార్టీల హక్కుల రక్షణ కోసం ఉద్యమిస్తూ అనేక పోరాటాలకు పిలుపునిచ్చి విజయాలు సాధించిన చరిత్ర భీమ్ ఆర్మీకి చెందుతుందని అన్నారు. స్వతంత్రం వచ్చి యేళ్లు గడుస్తున్న దళిత, బహుజన, మైనార్టీలు సామాజిక, ఆర్థిక, రాజకీయా అణచివేతకు గురివుతున్నారన్నారు. బహుజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేస్తే ఈ అణచివేతకు అడ్డుకట్ట వేయవచ్చని భీఎ ఆర్మీ నిరంతరం ప్రజ పోరాటాలు చేస్తూ రాజ్యాధికారం అందించే దిశగా ఉద్యమిస్తుందని వివరించారు. భీమ్ ఆర్మీ ఉద్యమాల్లో విద్యార్థి యువకులు, మేధావులు బడుగు బలహీనవర్గాల వారంత బాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్, నవీన్, అక్కనపల్లి శేఖర్, రాంజీ, దినేష్, ప్రదీప్, అరుణ్, సాగర్, రాజు, మహిపాల్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

తల్లి బాగోగులు చూసుకోని కుమారులు

- శిథిలావస్థలో ఉన్న ఇంటిలో వృద్ధురాలు

- కలెక్టర్‌కు కుమార్తె ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, జూలై 21: ముసలితనంలో ఆలన పాలన చూడాల్సిన కన్న కొడుకులే పట్టించుకోక పోవడంతో ఆ వృద్ధురాలు అనాథగా మారింది. అధికారుల కథనం మేరకు కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో కోట లచ్చమ్మ (80)కు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. అందులో ఒక కుమా రుడు మృతి చెందాడు. శిథిలావస్థలో ఉన్న ఇంట్లో ఒంటరిగా ఉంటున్న లచ్చమ్మ శనివారం ప్రమాదవశాత్తు జారిపడగా కుమారులతో పాటు కుమా ర్తెకు స్థానికులు సమాచారం అందించారు. కుమార్తె మల్లవ్వ మాత్రమే తల్లి వద్దకు రాగా కుమారులు రాలేదు. లచ్చమ్మ పెద్ద కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా, రెండో కుమారుడు తన అత్తగారింటి వద్ద ఉంటున్నాడు. మూడో కుమారుడు నగునూర్‌లోనే వ్యవసాయం చేసుకుంటున్నాడు. నాలుగో కుమారుడు మృతి చెందాడు. దీంతో సోదరులు తన తల్లి బాగోగులు చూడలే దంటూ కలెక్టర్ పమెలా సత్పతికి కుమార్తె ఫిర్యాదుచేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం తహసీల్దార్ నవీన్, ఆర్ఐ వాస్తవిక్, బ్లూకోర్టు పోలీసులు లచ్చమ్మను చికిత్సకోసం కరీంనగర్ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.


వృద్ధురాలిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీస్‌లు, రెవెన్యూ సిబ్బంది

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షం


మత్తడి దూకుతున్న మానకొండూర్ మండలం దేవంపల్లి చెరువు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి ఎడతెరిపిలేని వాన కురుస్తోంది. దీంతో చెరువులు నిండుకుండలా మారాయి. వాగులు మత్తడి దూకుతున్నాయి. రోడ్లు జలమయం కాగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై నిలిచిన వాన నీటిని డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు.


మత్తడి దూకుతున్న మూలవాగు చెక్‌డ్యాం


చిగురుమామిడి మండలం ఇందారం-కోహెడ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


కోతిరాంపూర్‌లో రోడ్డుపై నిలిచిన వరదనీటిని తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది


వడుకాపూర్ శివారులో హుస్సేన్‌మియా వాగు రోడ్యాంపై ప్రవహిస్తున్న వరద నీరు


పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో లోలెవల్ వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఏసీపీ కృష్ణ


చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో మత్తడి దూకుతున్న గార్ల కుంట

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారం, నగదు అపహరణ

మల్యాల, జూలై 21: మల్యాల మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పుప్పాల దేవయ్య అనే వ్యక్తి శనివారం ఇంటికి తాళం వేసి ఇదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం తన ఫోన్‌లో ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా ఇంటి ద్వారం తెరచి ఉండడం కనిపించింది. దీంతో అతను, బంధువులు వచ్చి పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తులు ద్వారం తాళం, గొల్లెం పగులగొట్టి లోపలికి వెళ్లి ఇంట్లోని వస్తువులను అస్తవ్యస్తంగా పడేశారు. దీంతో దేవయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్‌కుమార్ సంఘటన స్థలంలో క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో గాలించారు. బీరువాలోని రూ.43 వేల నగదుతో పాటు తులం బంగారం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు

ఇల్లందకుంట ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

● రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి


రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు


ఇల్లందకుంట, జూలై 21: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు తప్పకుండా కృషి చేస్తానని హెటరో డ్రగ్స్ అండ్ ఫార్మసీ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ మేరకు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా, ఆశీర్వచ మండపంలో ఎంపీ పార్థసారథిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనం, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఎంపీ పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ఆలయానికి కావాల్సిన అభివృద్ధి పనుల గురించి ఈవో తన దృష్టికి తీసుకవచ్చారని చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కార్యాలయం, ఆలయంలో రేకుల షెడ్డు నిర్మాణం, కొత్తపల్లి, మల్యాల గ్రామ శివారులో రెండు ఆర్చీల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో కూడా ఆలయానికి సుమారు మూడు కోట్ల రూపాయలతో సాలారం, రాజగోపురం, బండ పరుపు, స్వామివారి కల్యాణానికి మండపం లాంటి పనులు తన సొంత ఖర్చులతో చేపట్టానని గుర్తు చేశారు. అదేవిధంగా ఆలయ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినట్లయితే తప్పకుండా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, సంపత్‌రావు, శీలం శ్రీనివాస్, మధు, తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, జూలై 21: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆషాఢ మాస పౌర్ణమి పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి నదిలో చేరిన కొత్త నీటితో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పంచోపనిషత్తులతో క్షీరాభిషేకం, నిత్య పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

ధర్మపురి వద్ద గోదావరి వరద


ధర్మపురి వద్ద స్నానఘట్టాలు ఆనుకుని ప్రవహిస్తున్న గోదావరి నది

ధర్మపురి, జూలై 21: ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఆది వారం పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నిండి పోయిన చెరువులు, కుంటలు, వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. దీనికి తోడు కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువ గో దావరి నదిలోకి 14,333 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీంతో ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహం పెరిగి ప్రజలు ఇబ్బం దులకు గురవుతున్నారు. ధర్మపురి వద్ద ఉసిరిక వాగు దాటి నీటి ప్రవాహం కొనసాగుతుంది. స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయా యి. రాత్రి వరకు గోదావరి నది వరద మరింత పెరిగే అవకాశం ఉంది. సమీప గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమ త్తం చేశారు. వరద ప్రాంతాన్ని తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ సందర్శించారు.

● **కోటిలింగాల వద్ద..**

వెల్గటూర్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరి లోకి వరద నీరు చేరుతోంది. కడెం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి 18227 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలో నీటి మట్టం పెరుగుతోంది. గోదావరి లోకి వరద నీరు చేరుతుండడంతో పుష్కర ఘాట్ల వరకు నీరు చేరింది. గోదావరిలో వరద నీరు చేరి నీటి మట్టం పెతుండడంతో గొర్ల కాపర్లు, మత్స్యకారులు గోదావరి లోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గోదావరిలో పుణ్య స్నానాలు చేసే భక్తులు లోతు ప్రాంతానికి వెళ్ల వద్దని తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్ హెచ్చరించారు. కాగా మండలంలో గత రెండు రోజులుగా ముసురు వాన పడుతోంది. దీనితో చెరువులు, కుంటల్లోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. మండలంలో ఆదివారం 61.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.


కోటిలింగాల వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల వరకు చేరిన నీరు

అంజన్న భక్తుల గిరిప్రదక్షిణ


భక్తులతో సురేష్ ఆత్మరామ్ స్వామిజీ

మల్యాల, జూలై 21: కొండగట్టు గిరిప్రదక్షిణను ఆదివారం చిలుకూరి బాలాజీ స్వామి శివాలయ ప్రధానర్చకులు సురేష్ ఆత్మరామ్ స్వామిజీ ఆధ్వర్యంలో అంజన్న భక్తులు చేశారు. ప్రతి పౌర్ణమి రోజున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంను 16వసారి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తంగళ్లపల్లి, జూలై 21: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆదివారం తంగళ్ళపల్లి మండలం దేశాయిపల్లె గ్రామ శివారులో వాగు నుంచి నేరెళ్లకు ఇసుక ను తరలిస్తుండగా పట్టుకొని ట్రాక్టర్లు సీజ్ చేశామని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు ఓనర్‌పై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక రవాణా సమాచారాన్ని సేకరించిన సిబ్బంది మల్లేశం, కిరణ్, సంపత్‌ను అభినందించారు.

బతుకమ్మ చీరల బకాయిలు ఎప్పుడిస్తరు?

- రెండేళ్లుగా పెండింగ్‌లో మూడు కోట్ల రూపాయలు

- బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నేత కార్మికులు


మగ్గాలపై తయారు చేస్తున్న బతుకమ్మ చీరలు

గంగాధర, జూలై 21: కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు ఆడబిడ్డలకు దసరా కానుకను అందించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మచీరల బకాయిలు రెండేళ్లుగా నిలిచిపోయాయి. సుమారుగా మూడు కోట్ల రూపాయల బకాయిలు ఎప్పుడిస్తారని మగ్గాల కార్మికులు ఎదురు చూస్తున్నారు. మినీ సిరిసిల్లగా పేరొందిన గంగాధర మండల గర్షకుర్తిలో 16 వందల మగ్గాలపై వస్త్రాలను తయారు చేస్తారు. మగ్గాలపై మూడు వందల మంది ఆసాములు, ఐదు వందల మంది కార్మికులు ఆధారపడ్డారు. చేనేతను బలోపేతం చేయడానికి కార్మికులకు చేతినిండా పనికల్పించేందుకు గత ప్రభుత్వ బతుకమ్మ చీరల తయారిని గర్షకుర్తికి అప్పగించింది. 2022 సంవత్సరానికి 20లక్షలు, 2023 సంవత్సరానికి 34లక్షల మీటర్ల గుడ్డను ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చింది. వివిధ రంగులు, డిజైన్లతో బతుకమ్మ పండుగకు నెల రోజుల ముందుగానే అందించాలని అధికారులు తొందరపెట్టగా రాత్రి, పగలు పనిచేసి గడువుకన్నా ముందుగానే చీరలను అందించారు. చీరల తయారీ మూడు నెలల సమయంలో గర్షకుర్తిలో ఎక్కడ చూసినా సాంచల సప్పుడే వినిపిస్తుండేది, వాడవాడల బీములు నింపటోళ్లతో, చీరలను తీసుకెళ్లే ఆటోలతో సందడిగా ఉండేది. అయితే గత ప్రభుత్వ చీరల తయారి చేసిన ఆసాములకు రెండేళ్లుగా డబ్బులు ఇవ్వడం ఆగిపోయింది. చీరల తయారీ బిల్లులు అందించాలని కోరగా 30 శాతం అప్పటి ప్రభుత్వం అందించింది. మరింత రావాల్సి ఉండగా ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు చేతులెత్తేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాకా ఏప్రిల్‌లో బిల్లులు అడగగా 40 శాతం మంజూరు చేసింది. ఇంకా 30 శాతం బిల్లులు రావాల్సి ఉంది. అయితే ఆసాములు కార్మికులకు అప్పులు చేసి జీతాలు ఇచ్చామని ప్రభుత్వం నుంచి బిల్లులురాక మగ్గాలు మూతపడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం చేనేత కార్మికులపై ప్రత్యేక చొరవ తీసుకుని మగ్గాలకు రావాల్సిన పాత బకాయిలు చెల్లించాలని వేడుకుంటున్నారు. సుమారుగా ఒక్క గర్షకుర్తికే 3కోట్ల బకాయిలు రావాల్సి ఉంది.

● **రూ. 20 లక్షల వరకు రావాల్సి ఉంది**

అలువాల తిరుపతి, ఆసామి గర్షకుర్తి



లక్షల మీటర్ల చీరలను అందించారు. చీరలు తయారు చేసిన వెంటనే డబ్బులు ఇస్తామని అధికారులు తొందర పెట్టి రాత్రీపగలు పనులు చేయించారు. రెండేళ్ల నుంచి నాకు రావాల్సిన రూ. 20లక్షల బిల్లు కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ప్రభుత్వం స్పందించి బిల్లులు అందించి ఆదుకోవాలి.

మద్యం తాగేందుకు దోపిడీ

● బంగారు, వెండి గొలుసులతోపాటు ఐఫోన్ అపహరణ

● నిందితులను పట్టుకున్న పోలీసులు

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

మల్యాల, జూలై 21: ఇద్దరు మిత్రులు మద్యం తాగేందుకు ఓ వ్యక్తి వద్ద దోపిడీకి పాల్పడి నగదు, బంగారు, వెండి గొలుసుల తో పాటు ఐఫోన్ అపహరించగా నిందితుల ఊహాచిత్రాల ఆధారంగా పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపరిచారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఈ మేరకు మల్యాల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం రాజారానికి చెందిన గుర్రం వెంకటేష్, మల్యాల మండల కేంద్రానికి చెందిన మల్యాల విష్ణువర్ధన్ మిత్రులు. నాలుగు నెలల క్రితం విష్ణువర్ధన్ దుబాయి వెళ్లి వచ్చాడు. వచ్చాక దావత్ ఇవ్వాలని విష్ణువర్ధన్‌ను అడుగగా ఈ నెల 9న కొండగట్టుకు వచ్చి మార్గమధ్య లోని కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి క్వారీల వద్దకు వెళ్లే దారిలో ఇద్దరు మద్యం తాగారు. మరింత మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవడంతో దొంగతనం చేసి తాగాలనుకున్నారు. అదే సమయంలో జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌కు చెందిన బండారి స్వామి కొడిమ్యాల మండలం నాచుపల్లికి వెలుతున్న క్రమంలో వెంకటేష్, విష్ణువర్ధన్ స్వామిని కర్రలతో కొట్టి అతని మెడలో గల తులంన్నర బంగారు గొలుసు, మూడు తులాల వెండి బ్రాస్‌లెట్, రూ.3500నగదుతో పాటు ఐఫోన్ లాక్కొని పారిపోయారు. దొంగిలించిన వస్తువులను వెంకటేష్ తన ఇంటికి తీసుకెళ్లాడు. బాధితుడు ఇచ్చిన వివరాల ప్రకారం ఊహాచిత్రాలను రుపొందించి, సాంకేతికత ఆధారంగా మళ్లీ చోరీకి ఆదివారం స్కెచ్ వేస్తుండగా పోలీసులు వచ్చి ఇద్దరిని పట్టుకున్నారు. దొంగిలించిన వస్తువుల విలువ రూ.1.50లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద బంగారు, వెండి గొలుసులు, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో సీఐ నీలం రవి, ఎస్సై నరేష్‌కుమార్, ఏఎస్సైలు మల్లారెడ్డి, కృష్ణ హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, బాష పాల్గొనగా కేసు త్వరితగతిన చేధించిన సీఐ, ఎస్సై, కానిస్టేబుల్లు రాజేందర్, సంతోష్‌లను డీఎస్పీ అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 21: మండలంలోని తిప్పన్నపేట గ్రామానికి చెందిన తూము సుమలత(36) అనే వివాహిత అప్పుల బాధ భరించలేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమలత భర్త బాలయ్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భర్త చనిపోవడంతో కూలీ పనిచేసుకుంటూ సుమలత తన ఇద్దరు కూతుళ్లను పోషించింది. సంవత్సరం క్రితం తన పెద్దకూతురు వైష్ణవికి రూ. 10 లక్షలు అప్పుచేసి పెళ్లి చేసింది. అప్పటి నుంచి అప్పుతీర్చే మార్గం లేకపోవడంతో తరచూ బాధపడుతూ ఉండేది.

ఇదే క్రమంలో ఆదివారం ఉదయం సుమలత పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా బంధువులు జగిత్యాల ఏరి యా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సుమలత మృతితో బంధువుల రోధనలు మిన్నంటాయి. మృతురాలి తండ్రి పిట్ట రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెల్పూర్‌కు పొంచి ఉన్న ముంపు ముప్పు

● బ్యాక్ వాటర్‌తో యేటా మునుగుతున్న ఎస్సీ కాలనీ, సమీప గ్రామాలు

● వర్షం పడిన ప్రతీసారి సురక్షిత ప్రాంతాలకు తరలింపు

హుజూరాబాద్‌రూరల్, జూలై 21: మండలంలో అతిపెద్ద మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న చెల్పూర్‌కు ముంపు ముప్పు పొంచి ఉంది. అటు అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ప్రతియేటా ప్రజలు నరకాన్ని అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలోని పెద్ద, చిన్న చెరువుల బ్యాక్ వాటర్ మూలంగా ప్రతియేటా గ్రామంలోని ఎస్సీ కాలనీ, సమీప గ్రామాలు నీటమునుగుతున్నాయి.

● **కలగానే మిగిలిన రిజర్వాయర్ నిర్మాణం..**

గ్రామంలో 362 ఎకరాల్లో పెద్ద చెరువు, 285 ఎకరాల్లో చిన్న చెరువులు ఉన్నాయి. రెండు చెరువుల మధ్య లింక్ కెనాల్ గ్రామం మధ్యలో నుంచి ఉంది. రెండు చెరువులను కలిపి రిజర్వాయర్‌గా నిర్మిస్తామని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొదలుకొని నిన్నటి ఎన్నికల వరకు ప్రజాప్రతినిదులు హామీలు ఇచ్చారే తప్ప. హామీ కార్యరూపం దాల్చడం లేదు. రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సుమారు 15 గ్రామాల ప్రజలకు లాభం చేకూరే అవకాశం ఉంటుంది.

● **వెంటాడుతున్న ప్రధాన సమస్యలు..**

రెండు చెరువుల మధ్య గ్రామం మధ్యలో నుంచే వెళ్తున్న లింక్ కెనాల్ సరిగ్గా లేకపోవడంతో సెట్ బ్యాక్ వాటర్‌తో నిత్యం ఎస్సీ కాలనీ నీట మునుగుతుంది. లింక్ కెనాల్‌కు లైనింగ్ చేయిస్తే సమస్య తీరే అవకాశం ఉంటుంది. జూపాక గ్రామం వైపు ఒక మత్తడి, చెల్పూర్‌లో రెండు వైపుల మత్తడి ఉంది.

వానాకాలం మత్తడి ఎక్కువగా ఉంటే జూపాక-చె ల్పూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. ఒక వేళ పెద్ద చెరువు కట్ట తెగితే ఊరు మునిగిపోయే ప్రమాదం ఉంది. మత్తడిలపై వంతెన నిర్మిస్తే వానాకాలంలో కట్ట తెగితే సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది.


చిన్న చెరువు నుంచి డంప్ అవుతున్న వరద నీరు(ఫైల్)


ఎస్సీ కాలనీలో చుట్టుముట్టిన వరద నీరు(ఫైల్)

● **నిర్మాణాలకు నోచుకోని తూములు..**

దీనికి తోడు చెరువులకు సంబంధించిన తూములు సైతం నిర్మాణాలకు నోచుకోవడం లేదు. రెండు చెరువులకు సంబంధించిన లింక్ కెనాల్ గ్రామం మధ్యలోని ఎస్సీ కాలనీ గుండా వెళ్తుంది. వానాకాలంలో మాణిక్యాపూర్, నర్సింగాపూర్, కందుగుల గ్రామాల్లోని చెరువుల నీరు, హుజూరాబాద్ పట్టణ శివారులోని చిలుకవాగు వరద నీరు పెద్ద చెరువులోకి వస్తుంది. వరదను పెద్ద చెరువు నుంచి చిన్న చెరువులోకి డంప్ చేసే సమయంలో సెట్ బ్యాక్ వాటర్‌తో ఎస్సీ కాలనీ, సమీప గ్రామాల్లో ఇళ్లు నీటమునుగుతున్నాయి. ఫలితంగా ప్రతియేటా ఎస్సీ కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

● **శాశ్వత పరిష్కారం చూపితే మేలు..**

- నేరేళ్ల మహేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్, చెల్పూర్



గ్రామంలో ఎస్సీ కాలనీ పక్క నుంచి లింకెకెనాల్ వెళ్తున్న సమయం లో ప్రతియేటా వరద మూలంగా కాలనీ మునుగుతుంది. ఈ సమస్య తీరాలంటే వెంటనే పెద్ద, చిన్న చెరువులను కలుపుతూ రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అలాగే రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సుమారు 15 గ్రామాల ప్రజలకు లాభం చేకూరుతుంది.


పర్సు దొంగిలిస్తుండగా పట్టుకున్న ఆర్టీసీ సెక్యూరిటీ

కరీంనగర్ క్రైం, జూలై 21: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఒక ప్రయాణికుడు హైదరాబాద్ బస్సు ఎక్కే సమయంలో అతని జేబులో నుంచి పర్సును తీసే ప్రయత్నం చేస్తుండగా బాలుడు(9)ని బస్సు స్టేషన్ సెక్యూరిటీ సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు. నిందితుడిని పట్టుకున్న వారిలో ఆర్టీసీ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ ఎం సాగర్, కానిస్టేబుళ్లు ఎ కవిత, హరీష్‌లు ఉన్నారు.

ముగిసిన శాకంబరి ఉత్సవాలు

కరీంనగర్ రూరల్, జూలై21:కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గ భవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేదం పండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరుగుతునన శాకంబరీ ఉత్సవాలు ఆదివరాం ముగిసాయి. చివరి రోజుదుర్గభవానీ అమ్మవారు 54 రకాల కూరగాయల మాలల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వ్యాస పూర్ణిమ సందర్భంగా వ్యాస మునీకి విశేష పూజలు, చండి హోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పల్లకి సేవ, సహస్ర దీపాలంకరణ, ఉయ్యాల సేవ పూజలను నిర్వహించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం



చింతల కిషన్ పటేల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

భగత్‌నగర్, జూలై 21: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ లయన్ చింతల కిషన్ పటేల్‌ను ఉత్తమ సేవలకు గాను ఆదివారం సన్మానించారు. చింతల కిషన్ పటేల్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రిలో బొమ్మకల్ గుంటూరుపల్లికి చెందిన గొంటి వజ్రమ్మతో పాటు 123మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్స నిర్వహించారు. రీజియన్ 8 జోన్ 2 లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 జి జోన్ ఛైర్‌పర్సన్ చింతల కిషన్ పటేల్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలు నిర్వహించి బ్రెడ్‌లు, పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి ఛైర్మన్ కొండ వేణుమూర్తి సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు.

ప్రామాణిక పరిశోధకుడు 'సుంకిరెడ్డి'

కరీంనగర్ కల్చరల్, జూలై 21: తెలంగాణ చరిత్ర నిర్మాణంలో ప్రతిభావంతుడైన ప్రామాణిక పరిశోధకుడుగా సుంకిరెడ్డి నారాయణరెడ్డి భావి శోధకులకు చక్కని తోవలు వేశారని బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఫిలింభవన్‌లో ఆదివారం సునారె రెండు పుస్తకాల పరిచయం-పరామర్శ సదస్సు జరిగింది. సాహిత్య పరిశోధకుడు జిలుకర శ్రీనివాస్, బూర్ల వేంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, దామరకుంట శంకరయ్య, మేడి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రెనే స్కై ఫిట్‌నెస్ క్లబ్ జిమ్ ప్రారంభం

సుభాష్‌నగర్, జూలై 21: రెనే స్కై ఫిట్‌నెస్ క్లబ్ జిమ్‌ను ఆదివారం మేయర్ వై సునీల్‌రావు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిమ్ ఛైర్మన్, రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ వైద్య సేవలతో పాటు ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ హెల్త్ క్లబ్ ప్రారంభించామని తెలిపారు. జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించ వచ్చన్నారు. అనంతరం జిమ్ మేనేజింగ్ డైరెక్టర్, నేషనల్ బాడీ బిల్డింగ్ రిఫరీ, తెలంగాణ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఇంతియాజ్ మాట్లాడుతూ అత్యున్నత, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరికరాలను ఈ జిమ్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి విజయ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ వాల రమణారావు, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, కార్పొరేటర్ అలిబా, ఇనుగుర్తి రమేశ్, జగదీశ్వరాచారి, ముత్తోజు వణు, కోట సత్యం, మేకల అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

భీమ్ ఆర్మీ ఆవిర్భావ వేడుకలు

సుభాష్‌నగర్, జూలై 21: భీమ్ ఆర్మీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఆదివారం స్థానిక కోర్టు చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ భీమ్ ఆర్మీ స్థాపించి 9 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రాజ్యాధికారం రావాలంటే అది కేవలం భీమ్ ఆర్మీతోనే సాధ్యమన్నారు. భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ ఆజాద్ రావన్ ఉత్తర్‌ప్రదేశ్ నుంచి పార్లమెంట్ సభ్యునిగా రెండు లక్షల మెజార్టీతో గెలుపొందారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని గ్రామ గ్రామానికి భీమ్ ఆర్మీని విస్తరింపచేయాలన్నారు. దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే భీమ్ ఆర్మీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలగందుల అనిల్‌కుమార్, ఎల్కతుర్తి గణేశ్, బోయిని ముఖేష్, జితేందర్, శివ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం



జమ్మికుంటలో సమావేశమైన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

జమ్మికుంట, జూలై 21: జమ్మికుంట పట్టణంలోని మయూరి ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2003-2006 బీకామ్ గ్రూపు పూర్వ విద్యార్థులు గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఇరువై సంవత్సరాల క్రితం కలిసి మెలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు అంతా కలుసుకొని గత స్మృతులను నెమర వేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన అధ్యాపకులు డాక్టర్ చంద్రమౌళి, లింగారెడ్డి, విజేందర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌లను శాల్వలతో ఘనంగా సన్మానించారు. ఒకే చోట కలిసి మెలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ఏ స్థాయిలో స్థిరపడ్డ కూడా గురువులు, స్నేహితులను మరవకుండా ఒకరికి ఒకరు తోడ్పాడాలని అధ్యాపకులు సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొలువురు సురేష్, వడ్లూరి కిషోర్, గాజుల శ్రీధర్, మైనర్, కిరణ్, హజరత్ పాషా, జగన్, శ్రీకాంత్, తహేర, అలియాంజ్, అఖండేశ్వరి, అలువేని, నసీమా, రమ్యకృష్ణలతో పాటు 50మంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శంకరపట్నం, జూలై 21: మండలంలోని కన్నాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక వేదికపై కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితులు కలవగానే మధుర స్మృతులు మదిలో మెదులుతాయని పూర్వ విద్యార్థులు వేదికపై తెలిపారు. సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, వారిని శాలువాలతో సన్మానించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



జమ్మికుంట రూరల్, జూలై 21: జమ్మికుంట మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఎనిమిల్ల రాజేంద్రప్రసాద్ ఆదివారం నియామకం అయ్యారు. ఇటీవల ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన గుండా తిరుపతయ్య అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. దీంతో నిత్యం ఆర్యవైశ్యులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్న రాజేంద్రప్రసాద్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు చందా రాజు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ర్యవైశ్య సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ అనూష



చొప్పదండి, జూలై 21: చొప్పదండి ఎస్ఐగా జి అనూష ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఉపేంద్రచారి బదిలీకాగా ఆయన స్థానంలో అనూషకు చొప్పదండి ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో అనూష బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు


కరీంనగర్‌లోని వేదభవనంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, జూలై 21: నగరంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. భగవద్రామానుజులకు ప్రత్యేక పూజలు జరిపి చిన్న జీయర్‌స్వామి ప్రవచనాలను మననం చేసుకున్నారు. స్వామీజీ చూపిన మార్గంలో పయనించి జీవితాలను సార్థకత్వం చేసుకోవాలని వేదభవనం ఆచా ర్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు, సభ్యులు పాల్గొన్నారు.

●జ్యోతినగర్‌లో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గురుపరంపర, గురువుల విశిష్టతను మిషన్ బాధ్యుడు అక్షయచైతన్య వివరించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో మిషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు గంప జలందర్, నలుమాచు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి గజవాడ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి రజనీకాంత్, కోశాధికారి రాజేందర్, సత్యనారాయణ, చంద్రం, రాజేశ్వర్, శ్రీశైలం పాల్గొన్నారు.

●సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో గురుపౌర్ణమి సందర్భంగా సాహితీవేత్త, అవధాని, విశ్రాంత ఉపన్యాసకుడు డాక్టర్ గంగ్ర లక్ష్మణరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాపీఠం కార్యనిర్వాహక సభ్యుడు ఎలగందుల సత్యనారాయణ, కార్యదర్శి కోల అన్నారెడ్డి పాల్గొన్నారు.

●బొమ్మకల్‌రోడ్‌లోని పంచముఖ హనుమాన్ దేవాల యంలో తెలంగాణ కులసంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ ఆధ్వర్యంలో పీఠాధిపతి పరబ్రహ్మానంగిరిస్వామికి సన్మానం, గురుపూజ చేశారు. కార్యక్రమంలో తోట రాజేందర్, కంకణాల రాజిరెడ్డి, హరి ఆంజనేయులు, జి సరిత, కీర్తన, హనుమాండ్లు, వేంకటేశ్‌తో భక్తులు పాల్గొన్నారు.

●ప్రతీ ఆదివారం మాతా మాణిక్యేశ్వరి ఆశ్రమంలో డాక్టర్ శ్రీలతరెడ్డి, డాక్టర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న సనాతన ధర్మ ప్రచార సమితి సుపథా కార్యక్రమంలో గురువులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, డాక్టర్ రఘురామన్, డాక్టర్ రామ్‌కిరణ్‌లు పాల్గొన్నారు. సంగీతం, సనాతన సాంప్రదా యాలు, లలిత కళలు, యోగా, శ్లోక పఠనాల్లో శిక్షణనిచ్చిన కెబి శర్మ, మాధవి, శశికళ, రాజలింగం, గిరిబాబులను సన్మానించారు.

●**జమ్మికుంట రూరల్:** జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల లక్ష్మీగణపతి షిరిడీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సముద్రాల ప్రసాదాచార్యులు, కిషోరాచార్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. సత్యసాయి సదన్‌లో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

●**చొప్పదండి:** చొప్పదండిలో గురుపూర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకిసేవను నిర్వహించారు.

●**తిమ్మాపూర్:** స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(అటానమస్) కళాశాల ఆవరణలో నిర్మించిన సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. జ్యోతిష్మతి విద్యాసంస్థల ఛైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, ఛైర్‌పర్సన్ విజయ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

యజ్ఞవరాహక్షేత్రంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, జూలై 21: వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో ఆదివారం రెండవ రోజు ఉదయం అభిషేకం, పవిత్ర సమర్పణ, పదశ్రీ శ్రీభాష్యం విజయ సారథి గురు పూజా మహోత్సవం, సాయంత్రం మహాశాంతి హోమం, ఆస్థానం, దీపోత్సవం, తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట స్ఫూర్తి దాశరథి

కరీంనగర్ కల్చరల్, జూలై 21: నిజాం ప్రభువును నిరసిస్తూ ధైర్యంగా కవిత్వం చెప్పిన కవి, తెలంగాణ పోరాట స్ఫూర్తి దాశరథి అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ దార్ల వేంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన గూగుల్ మీట్ ద్వారా జరిగిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దాశరథిలో ప్రణయము, విప్లవము రెండూ పార్శ్వాలున్నాయని అన్నారు. అతిథులుగా హాజరైన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కార గ్రహీత కాంచనపల్లి గోవర్ధన్‌రాజు, గంటా మనోహర్‌రెడ్డి మాట్లాడారు. ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 60 మందికి పైగా పాల్గొని తమ కవితలను వినిపించారు.

ఎన్నీల వెలుగుల్లో జ్ఞాన ప్రసారం

కరీంనగర్ కల్చరల్, జూలై 21: దశాబ్ద కాలంగా కరీంనగర్‌లో ప్రతీ పౌర్ణమికి జరుగుతున్న ఎన్నీల ముచ్చట్ల వెలుగులో జ్ఞాన ప్రసారం జరుగుతోందని విశ్రాం ఆచార్యుడు ముక్కల లక్ష్మన బోధి అన్నారు తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వేంకటేశ్వర్లు ఆతిథ్యంలో ఆయన నివాసంలో 135వ ఎన్నీల ముచ్చట్ల సాహిత్య కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మానవ వికాసంలో ఎన్నీల వెలుగుల చర్చలు, ఆటా పాటలు కీలక పాత్ర పోషించాయని అన్నారు. బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ మాట్లాడుతూ కవులకు నిరంతర అధ్యయనం ఎంతో అవసరమని అన్నారు. అనంతరం పలు అంశాలపై కవులు, రచయితలు తమ కవితలు వినిపించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్యలు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కూకట్ల తిరుపతి, రామానుజం సుజాత, సిరిపురం వాణిశ్రీ, మేడి చంద్రయ్య, పెనుగొండ బసవేశ్వర్, తోట నిర్మలారాణి, గుడికందుల అరుణ్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలను స్థాపించి ఉపాధి కల్పించాలి


సదస్సును ప్రారంభిస్తున్న కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావు

కరీంనగర్ టౌన్, జూలై 21: నలుగురికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పరిశ్రమలను స్థాపిం చాలని, ఇందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకా లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బి.నవీన్‌కుమార్ నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. దేశమంతా ప్రజలకు ఎంఎస్ఎంఈ చట్టాలపై అవగాహన కల్పించేందుకు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కేంద్రశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 100 రోజులలో 100 నగరాలు అనే ఒక వినూత్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఐసీఏఐ కరీంనగర్, లఘు ఉద్యోగ భారతి సంయుక్త ఆధ్వర్యంలో వైశ్య భవన్‌లో ఎంఎస్ ఎంఈ ప్రజాసదస్సు జరిగింది. ఈ సదస్సులో మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ మైక్రో (ఎంఎస్ఎంఈ) చట్టాలపై అవగాహన కల్పించారు. కరీంనగర్ డెయిరీ ఛైర్మన్ సిహెచ్.రాజేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తోందన్నారు. యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్, రీజినల్ హెడ్ మాట్లా డుతూ పరిశ్రమల స్థాపనకు అందిస్తున్న రుణా లను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ చార్టెడ్ అకౌంట్ కరీం నగర్ శాఖ ఛైర్మన్ అనిరెడ్డి చిరంజీవి, వైస్ ఛైర్మన్ వెన్నం మల్లేశం, కార్యదర్శి సంతోష్, సతీష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల వేడుకలు


మడేలయ్య బోనాల వేడుకల్లో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్, జూలై 21: నగరంలోని 53వ డివిజన్‌లో మైసమ్మతల్లి, గోదాంగడ్డ మైసమ్మతల్లి ఆలయాల వద్ద మేయర్ సునీల్‌రావు హాజరై బోనమెత్తుకున్నారు. 33వ డివిజన్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన మడేలయ్య బోనాల కార్యక్రమంలో, కాశ్మీరగడ్డ, భగత్‌నగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోచమ్మ బోనాల్లో మేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: కరీంనగర్‌లో గోసంగి, కుమ్మరి కులస్థుల పోచమ్మ బోనాలలో సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. బైపాస్ రోడ్‌లోని దేవుళ్ళపురిలో ఉన్న పోచమ్మ గుడిలో ఆదివారం నిర్వహించిన కుమ్మరి కులస్థుల బోనాల పూజల్లో పాల్గొన్న నరేందర్ రెడ్డికి స్వాగతం పలికారు. జ్యోతినగర్‌లోని సంతోషిమాత దేవాలయం నుంచి గోసంగి కుల ప్రతినిధులు, మహిళలు బోనాలెత్తుకొని పోచమ్మ గుడి వరకు వెళ్లారు.

●భగత్‌నగర్: మేదరి (మహేంద్ర) సంఘం ఆధ్వర్యంలో కులదేవత అయిన కాంకాలమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో రేకుర్తి మాజీ సర్పంచ్ నందేల్లి ప్రకాశ్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రహరీ లేక ఇబ్బందులు

● డ్రైనేజీ లేక పాఠశాల ఆవరణలో నిలుస్తున్న మురుగు నీరు



ప్రహరీ లేని పాఠశాల భవనం, డ్రైనేజీ లేక పాఠశాల పక్కనే పేరుకుపోతున్న మురుగు నీరు

ఇల్లందకుంట, జూలై 21: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. కేజీబీవీ పాఠశాల 2017 జూలై 15న ఇల్లందకుంట మండల కేంద్రంలో 6,7వ తరగతులకు గాను 91మంది విద్యార్థులతో అద్దె భవనంలో ప్రారంభించారు. ఆ తర్వాత అద్దె భవనంలో అరకొర వసతులు ఉండగా జమ్మికుంట మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నాలుగు సంవత్సరాలు అద్దె భవనంలో పాఠశాల విధులు నిర్వహించారు. అప్పటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ చొరవతో ఇల్లందకుంట మండలం లోని శ్రీరాములపల్లె గ్రామంలో రూ. 3.50కోట్ల నిధులతో సొంత భవనం నిర్మించారు. విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అందులో 6వ తరగతిలో 45, 7వ తరగతిలో 42, 8వ తరగతిలో 54, 9వ తరగతిలో 43, పదో తరగతిలో 33, ఇంటర్ మొదటి సంవత్సరంలో 33, సెకండీయర్‌లో 34, మొత్తంగా 296మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల క్రీడా మైదానం, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, డ్రైనేజీ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాలకు చుట్టూ ప్రహరీ నిర్మాణం లేకపోవడంతో రాత్రిపూట ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదేవిధంగా విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు క్రీడామైదానం చదునుగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో మురుగు నీరు పాఠశాలకు పక్కనే నీరు నిల్వ ఉంటోంది. దీంతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రహరీ, క్రీడామైదానం, డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

● ప్రతిపాదనలు పంపించాం..

- రమాదేవి, స్పెషల్ ఆఫీసర్, ఇల్లందకుంట



పాఠశాలకు ప్రహరీ నిర్మాణం, డ్రైనేజీ క్రీడా మైదానం చేపట్టేందుకు నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాము. వెంటనే నిధులు కేటాయించి పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని కోరాము.

సామూహిక కుంకుమార్చన


కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

గన్నేరువరం, జూలై 21: మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌కు చెందిన వాసవి వాగ్దేవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, సెక్రెటరీ స్వరూప, ఉపాధ్యక్షులు లత, హరిణి, మాడిశెట్టి గోపాల్, ఆలయ కమిటి ఛైర్మన్ చంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


సుడా ఛైర్మన్‌ను కలిసిన నాయకులు

ఇల్లందకుంట, జూలై 21: శాతావాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంగిలే రామారావు ఆదివారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రామారావు, బండి మల్లేష్ పాల్గొన్నారు.

నేడు సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం

తిమ్మాపూర్, జూలై 21: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల మానకొండూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల సీఎంఆర్ఎఫ్ చెక్కుల జారీ, దరఖాస్తుల విధానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించి ఇక నుంచి సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే స్వీకరించాలని ఆదేశించారు. దీనిలో భాగంగా మానకొండూర్ నియోజకవర్గంలో సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. దీంతో దరఖాస్తుదారులకు మేలు జరుగుతుందని, దరఖాస్తు నంబరును వెంటనే పొందే వీలు ఉంటుందని, దరఖాస్తుల పరిశీలన స్టేటస్ తెలుసుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల నమోదులో మానకొండూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిందని, ఎమ్మెల్యేగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు 1,750 సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు నమోదయ్యాయని ప్రకటనలో పేర్కొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు


బోనాలతో మహిళలు

మానకొండూర్, జూలై 21: మండలంలోని లలితాపూర్ గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఆదివారం నిర్వహించారు. మహిళలు వర్షాన్ని లెక్క చేయకుండా బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బోనాలను పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పిల్లా పాప, పాడిపంటలను కాపాడాలని మొక్కులు చెల్లించారు. రెడ్డి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెల్మ రెడ్డి తిరుపతిరెడ్డి, పాఖాల రాజేందర్‌రెడ్డి, మహిళలు ఉన్నారు.

రోడ్డుపైనే లారీల పార్కింగ్‌తో ఇబ్బందులు

కరీంనగర్ క్రైం, జూలై 21 : కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని లారీ అసోసియేషన్‌కు సంబంధించిన లారీలు కృష్ణనగర్‌లోని వరహాలస్వామి గుడి దారిలో రోడ్డుపై పార్కింగ్ చేస్తుండటంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపైననే భారీ లారీలు పార్క్ చేయటంతో వర్షంలో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, లారీలను వెంటనే ఇక్కడి నుంచి తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. లారీలను లారీ అసోసియేషన్ పార్కింగ్ స్థలంలో పార్క్ చేసుకోవాలని, ప్రమాదాలు జరుగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

సుభాష్‌నగర్, జూలై 21: నిరుపేదలు, కూలీలను ఆదుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత రెండు మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షం వల్ల నిరుపేదలు, కూలీలు చాల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రోజువారి కూలీలు పనిలేక ఇల్లు గడవక చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నగరంలో డివిజన్ వారిగా పేదలు, కూలీలను గుర్తించాలని, అలాగే గ్రామాల్లో కూడా నిరుపేదలు, కూలీలను గుర్తించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

అత్యాచార బాధ్యులను కఠినంగా శిక్షించాలి

భగత్‌నగర్, జూలై 21: నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. సమాజంలో మహిళల పట్ల రోజు రోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగి పోతున్నాయన్నారు. వెంటనే స్పందించి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భగత్‌నగర్, జూలై 21: కొత్తపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 2023-24 పదవ తరగతి విద్యార్థులు గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వ హించారు. ఇరవై దశాబ్దాల తర్వాత ఒక్కచోట చేరి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆనాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

రైతాంగాన్ని మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

భగత్‌నగర్, జూలై 21: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫి పేరుతో రైంతాంగాన్ని మభ్యపెడుతున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. లక్ష రూపాయల లోపు రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మభ్యపెడుతూ మోసం చేస్తున్నదన్నారు. ఈ నెల 18వ తేదీ లోపు లక్ష రూపాయల రుణం తీసుకున్న రైతులందరికి నేరుగా రైతుల అకౌంట్‌లో జమ చేశామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో 30 శాతం కూడా రుణాలు మాఫీ కాలేదన్నారు. లక్ష రూపాయల లోపు రుణమాఫికి 16 వేల కోట్లు కావాల్సి ఉంటే 6 వేల కోట్ల నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుందన్నారు. రుణమాఫి కాని రైతులు బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు తలోమాట చెబుతున్నారన్నారు. రుణమాఫిపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదన్నారు. రైతు భరోసాకు ఇవ్వాల్సిన నిధులను రుణమాఫీకి మళ్లించారన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, లేనిచో సీపీఎం పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

సాహితీ ప్రతిభారత్న పురస్కారాల ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జూలై 21: స్థానిక ఫిలింభవన్‌లో ఆదివారం గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో సాహితీ ప్రతిభారత్న పురస్కారాల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా రచయిత, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ మాట్లాడుతూ కవులు, కళాకారుల ప్రతిభ గుర్తించి ప్రోత్సహించడమే గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దాడపాక శ్రీధర్‌ను అభినందించారు. అనంతరం రిక్క రాముడు రచించిన నా కవనాలాపన కవితా సంపుటిని ఆవిష్కరించారు. అతిథులుగా కవి పొర్లపాటి వేణుగోపాల్‌రావు, పర్యావరణవేత్త రవిబాబు మాట్లాడారు. దూడపాక శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిరెడ్డి, డాక్టర్ ఎస్‌కె అన్వర్ పాల్గొన్నారు.

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

జమ్మికుంట, జూలై 21: ప్రయాణికులు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ వరంగంటి రవి అన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు చోరీలు, సైబర్ నేరాలపై పోలీస్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రయాణికులు ఆదమరిచి ఉండకూడదని, దొంగలతో జాగ్రత్తగా ఉండాలని, బ్యాగులు దొంగలించేందుకు దొంగలు అన్ని విధాలుగా ప్రయత్నిస్తారన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకూడదని పలు సలహాలు, సూచనలు అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

హుజూరాబాద్, జూలై 21: ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టి బకాయిబడ్డ కరువు భత్యం డీఏలను మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు చొరవ చూపి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న మసీద్ కమిటీ అధ్యక్షుడు

మానకొండూర్, జూలై 21: మానకొండూర్‌లోని వాటర్ ట్యాంకు ప్రాంతంలో ఉన్న ఖబ్రస్థాన్ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మానకొండూర్ మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫొద్దీన్ అధికారులను కోరారు. మానకొండూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని 1524, 1526 సర్వే నంబర్లలో 2.38 ఎకరాల భూమిలో ఇరువైపులా రోడ్డు నిర్మాణం చేపట్టడడం జరిగిందన్నారు. మిగతా కొంత భూమిని ఆక్రమించుకొని ఇంటిని నిర్మించుకున్నారని ఆయన ఆరోపించారు. అయితే ఖబ్రస్థాన్ పక్కన 1525 సర్వే నంబరులో ఇదే గ్రామానికి చెందిన నెల్లి శంకర్‌కు 36గుంటల భూమి భూమి ఉందన్నారు. అయితే 36 గుంటల్లో తొమ్మిది గుంటల భూమి తక్కువగా ఉన్నప్పటికీ మజీద్ కమిటి నెల్లి శంకర్‌కు వత్తాసు పలుకుతున్నారని ముస్లింలలోని మరో వర్గం సభ్యులు ఆరోపించడం బాధాకరమన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సయ్యద్ సిరాజోద్దీన్, సభ్యులు ఎండీ గౌస్‌ఖాన్, సయ్యద్ సుభాని, ఎండీ గౌసొద్దీన్, అల్తాఫ్, ఎండీ సాధిక్ ఉన్నారు.